

# ఎందుకే నీకింత తొందరా...

## - బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**"ద్వారకా?"** అరిచినట్లుగా అడిగాను.

"అవునే.. ఆ రోజు నాన్న బ్యాంక్‌కి వెళ్ళొస్తా అని నేను వద్దంటున్నా వినకుండా స్కూటర్ వేసుకుని బయలుదేరారు.

నాన్న చెప్పడం మొదలుపెట్టారు.

"వెళ్ళేటప్పుడు బాగానే వెళ్ళాను. వచ్చేటప్పుడే కళ్ళు మసకలు కమ్మాయి.. గుండెల్లో సన్నగా నెప్పి మొదలయింది. ఆపుకోలేనంత పెయిన్. నెమ్మదిగా హాండిల్ వదిలేసి గుండె పట్టుకున్నాను. ఆ తర్వాత ఏమైందో తెలీదు.."

అమ్మ అందుకుంది.

"అంత ట్రాఫిక్‌లో స్కూటర్‌తో సహా పడిపోయారు. ఎవరో పట్టుకున్నట్లు అనిపించిందిట. మగతలో, అది ద్వారకానందన్ కావడం మా అదృష్టం. ఇంటికి జాగ్రత్తగా తీసుకొచ్చాడు. నేను తలుపు తీసి భయపడిపోయాను. నాన్నని పొదివి తీసుకొచ్చి బెడ్‌మీద పడుకోపెట్టి, "ఏం పరవాలేదు డాక్టర్ని పిలిపిస్తున్నాను" అంటూ ఫోన్‌లో కాల్స్ చేసాడు. ఈలోగా నానమ్మ చూసి రాగాలు మొదలు పెట్టింది. నాన్న నీరసంగా దాహం అన్నారు. నేను మంచి నీళ్ళు తాగిస్తుండగా ద్వారక లోపలికి వచ్చి "డాక్టర్ గోపీకృష్ణ వస్తున్నారు, కంగారు కంగారు పడకండి" అన్నాడు. మేం తెల్లబోయాం నాన్నకి ఆపరేషన్ చేసిన అంత పెద్ద డాక్టర్‌గారు మన ఇంటికి వస్తున్నారా? అని. నేను కాఫీ పెట్టేలోగానే, డాక్టర్‌గారి కారొచ్చి ఆగింది."

నాకు అరగడంలేదు వీళ్ళు చెప్పే విషయాలు. అమ్మా! అసలు ద్వారకని మీరు ఎలా గుర్తు పట్టారు? అతనికి మన ఇల్లు ఎలా తెలుసు?"

అమ్మ గబుక్కున ఆగిపోయి, ఏదో పట్టుబడినట్లుగా నాన్న వైపు చూసింది.

నానమ్మ "నువ్వెళ్ళిన కొన్నాళ్ళకి హనీష్ ఎడ్రెస్ ఇచ్చాడు. అతని ఫ్రెండ్‌నని వచ్చాడే ద్వారక. అప్పుడే నీకూ తనకీ ఏర్పడిన ఫ్రెండ్‌షిప్ గురించి మొత్తం విపులంగా చెప్పాడు."

"వాట్? మరి నేను చెపితే విరుచుకుపడిపోయి, హార్ట్‌లో స్టంట్ వేయించుకుని, మురిసిపోయిన నీ కొడుకు ఎలా రిసీవ్ చేసుకున్నాడు?" కోపంగా అడిగాను.

అమ్మ వెంటనే "అతను ఎంతో బాగా విడమర్చి చెప్పాడు. తనకీ నీకూ ఒకరిని ఒకరు అర్ధం చేసుకునే సమయం కావాలనీ, అలా అర్ధం చేసుకోకుండా పెళ్ళి చేసుకున్న వారు, పెళ్ళయిన కొన్నాళ్ళకే విడిపోతున్నారనీ అతని తల్లితండ్రులు మా జనరేషన్ వాళ్ళయినా, ఇలాగే ఒకరిని ఒకరు అర్ధం చేసుకోలేక తన చిన్నప్పుడే విడిపోవడంతో, తను ఎంతో కష్టపడ్తూ, ఒకరిని వదిలి ఒకరి దగ్గర ఉండాల్సి వచ్చినప్పుడు బాధపడ్తూ గడిపాననీ, అంతా చెప్పుకొచ్చాడు."

"మరి నా గురించి ఇంత జరుగుతుంటే రోజూ ఫోన్ చేసే నాకు ఎందుకు చెప్పలేదూ?" అడిగాను. నాకు ఏడుపోచ్చేస్తోంది.

"నీకు లైఫ్‌లో ఒక సీరియస్‌నెస్, ఒక గోల్ ఏర్పడుతున్నాయి ఇప్పుడిప్పుడే అని ద్వారక చెప్పొద్దన్నాడే" అంది అమ్మ.

"అమ్మా!" నేను ఇరిటేట్ అయి అరిచాను.

"ఈ బ్లాక్ అండ్ వైట్ మూవీస్ సస్పెన్స్‌లు మనకి 2024లో అవసరమా? నీ దయవల్ల నాకు ఆ పాత సినిమాల పిచ్చి వల్ల నా ఫ్రెండ్స్ స్పెసిమన్స్‌లా చూసేవారు తెలుసా?" అన్నాను.

నాన్న మధ్యలోకి వస్తూ "పరిక్షలు అయ్యాక నువ్వు వస్తావు అప్పుడు చెప్దాం అన్నాడు ద్వారక" అన్నారు.

"ఇంతకీ డాక్టర్ ఏం అన్నారు? మీరెందుకు అలా పడిపోయారు?" నాన్న పక్కన కూర్చుంటూ ఆతృతగా అడిగాను.

"బ్లడ్ సర్క్యులేషన్ అవడంలేదు అని హాస్పిటల్‌కి రమ్మని మరికొన్ని పరీక్షలు చేసారు. మందులు రాసిచ్చారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చెయ్యాల్సొస్తుందేమో అన్నారు" అన్నారు నాన్న.

"ఇన్ని జరుగుతున్నా నాకు చెప్పలేదు మీరు. హనీష్‌కైనా తెలుసా? వాడితోనూ ఈ 'డాక్టర్ చక్రవర్తి' సినిమా టైప్ సస్పెన్స్‌లేనా?" అన్నాను తల పట్టుకుని.

"వాడికి ద్వారక అన్నీ చెప్పాడు. వాడి ప్లేస్‌లో తనుండి అన్నీ సక్రమంగా చూస్తాననీ తొందరపడి రావద్దని మెసేజ్ చేసాడుట" అంది అమ్మ.

"మరి నీ సంగతేవిటి వసూ?" అన్నాను.

"ఎప్పటినుండో వున్న సమస్యేకానీ రక్తహీనతా, బలహీనం అయిపోతున్నానని లేడీ డాక్టర్‌కి చూపించుకుంటే, స్కాన్ చేసి త్వరగా సర్జరీ చెయ్యకపోతే కాంప్లికేటెడ్ అవుతుందని చెప్పారు. అందుకే ద్వారకే మళ్ళీ తనకి తెలిసిన పెద్ద గైనకాలజిస్ట్ దగ్గరకి తీసుకెళ్ళి సర్జరీ డేట్ ఫిక్స్ చేయించాడు" అంది అమ్మ.

"ఆయనగారికి ఇవి చెయ్యడం తప్ప వేరే పనులేవీ లేవటనా? ధీరజ్ తనకి బిజినెస్‌లో ప్రోబ్లమ్స్, వాళ్ళ మదర్‌కి బాలేదని చెప్పాడు?" అన్నాను.

"నువ్వు మరి అతను వేరే గర్ల్ ఫ్రెండ్‌ని చూసుకోలేదా? అని అడిగావుటగా? ఏం చెప్పాలో తెలీక అలా చెప్పాడుట" అని నాలిక కరుచుకుంది వసుంధర.

"ఈ స్క్రీన్‌ప్లేలో అందరూ తోడు దొంగలే" అరిచాను.

"అన్నట్లు, నీ స్క్రీన్ ప్లే క్లాసెస్? నీ గేరీ ఎలా వున్నారూ?" నాన్న అడిగారు.

"అదీ తెలుసా మీకు?" గొంతు చిన్నది చేసి నేల చూపులు చూసాను.

"మరి స్క్రీన్‌ప్లే చెయ్యడం ద్వారకకీ వచ్చుట ఎలా వుంది? " అడిగారు నవ్వుతూ నాన్న.

వసుంధర మాత్రం ఏడవడం మొదలుపెట్టింది.

"ఏమైందీ?" అడిగాను.

"నువ్వు లేని ఇల్లు, ఇల్లులా లేదే. మా జబ్బులన్నింటికీ కారణం నీవు దేశం కాని దేశంలో ఎలా వున్నావో అనే బెంగే కారణం. హనీష్ మాత్రం అక్కకి లైఫ్ అంటే తెలీడంలేదు, మీ రెక్కలకింద గూట్లో వుంటే. కొంచెం ఎగరనీయండి" అని మామీద అరిచాడు" అంది.

నామీద నాకే జాలేసింది.

నేను దిగులు పడ్తూ ఏ రహస్యాలు దాచాలనుకున్నానో అవన్నీ అందరికీ తెలుసన్న రహస్యం నాకు ఇప్పుడే తెలిసింది.

"ఇప్పుడెక్కడున్నాడు ద్వారక?" అడిగాను.

"జూబ్లీ హౌస్‌లో ఏదో గెస్ట్‌హౌస్ కొన్నానని చెప్పాడు" అన్నారు నాన్నగారు.

నాకెందుకో అతని పరపతీ, స్థితిగతులూ అతను చెప్పేది వీళ్ళకి నచ్చేట్లు చేసాయా? టిపికల్ మధ్య తరగతి మనస్తత్వంతో అని అనుమానం వచ్చింది.

ఇలాంటి ఓవర్ థింకింగ్ లేకపోతే రుష్యేంద్రమణిని కానుగా! మొదటినుండీ ఇదే ప్రోబ్లం.

"వంటచేస్తాను" అమ్మ వంటగదిలోకి వెళ్తుంటే ఆపాను.

"నేనొచ్చాగా.. నేను చేస్తాను."

"అదేవిటే జెట్‌లాగ్ అయినా తీరకుండానూ?" అంది అమ్మ.

"జెయింట్‌వీల్‌లో ఆగకుండా తిరుగుతున్నట్లే వుంది ఏడాదిగా. జెట్‌లాగ్ ఏ పాటి?" అన్నాను.

మాటిమాటికీ ఫోన్ వైపు చూస్తున్నాను. అతనికి ఫోన్ చెయ్యాలా వద్దా? ఇంట్లో వాళ్ళు ఎవరైనా ఈపాటికే మెసేజ్ చేసేసారా? అన్న ఆలోచనకూడా వచ్చింది.

అందరూ అతని వైపే.. నేను నా వైపు.

మరింకేవిటి ప్రోబ్లెం. అతన్ని వీళ్ళంతా ప్రేమిస్తున్నారుగా? అంటే... అదే నా ప్రోబ్లెం.

భోజనాల టైముకి "ఇంకో ప్లేట్ కూడా పెట్టు ద్వారకని కూడా రమ్మన్నాను" అన్నారు నాన్న.

వడ్డిస్తున్న నేను గరిటె విసిరికొట్టాను.

అందరూ షాక్."అదేవిటే? దెయ్యం పట్టినట్లు?" అంది అమ్మ.

"పట్టిన దెయ్యం వదిలింది. అతని కండీషన్‌లు నేను చెపితే నచ్చక గుండెపోటు గుమ్మడి అయిన మీరు ఇప్పుడెలా ఇంటి కొత్త అల్లుడిలా స్వీకరిస్తున్నారు? ఇంటికొచ్చిన అతని బెంజ్ కార్ చూసా? మనింట్లోకి నడిచొచ్చిన ఫైవ్ స్టార్ హాస్పిటల్ సీనియర్ సర్జన్‌ని చూసా? అతను కొత్తగా కొన్న గెస్ట్ హౌస్ చూసా? లేకమాటల్లో పెట్టి మిమ్మల్ని మెస్మరైజ్ చేసేసాడా? ఎందుకు?" అన్నాను.

"అయ్యో మేమంత డబ్బు మనుషులమటే?" బుగ్గలు నొక్కుకుంది వసుంధర.

"అది ప్రియంవద పెద్దమ్మ సుఖవంతమైన జీవితం.. ఆవిడ నగలూ, పట్టుచీరలతో నువ్వు విలువకట్టినప్పుడే అర్ధమైంది" అన్నాను.

"అసలే అమ్మకి ఒంట్లో బాగోలేదు ఏవిటా మాటలు?" అన్నారు నాన్న.

"వీళ్ళ అక్కా చెల్లెళ్ళ బుర్రలూ, మాటలూ అలాగే వుంటాయి కాబట్టి" అన్నాను.

"ఆ అబ్బాయి మంచివాడు. అదే చూసాం" అంది అమ్మ నెమ్మదిగా.

"మీ అమ్మాయిని పెళ్ళి చేసుకోను కానీ ఉంచుకుంటాను అన్నాడు" అన్నాను.

"రుషీ" నాన్న చెయ్యి లేచి గాల్లో ఆగిపోయింది.

"ఆగిపోయారేం? ఆ మాట నేను అన్నప్పుడు మొదటిసారి మీకొచ్చినది బాధ. ఇప్పుడు కోపం. అప్పుడు హాస్పిటల్‌లో ఎడ్మిట్ అయ్యారు. ఇప్పుడు గట్టిగా అతన్ని ఏమీ అనలేకపోతున్నారు కూడా ఎందుకు?" అన్నాను.

నేనెప్పుడూ వాళ్ళకి ఓ క్వశ్చన్ పేపర్‌నే! అన్ని జవాబులూ తెలిసినట్టే వుంటాయి. కానీ చెప్పలేరు. నా మాన్యుఫాక్చరింగ్ డిఫెక్ట్ అనుకుంట.

"రండి భోజనాలు చేద్దాం పిల్లెప్పుడు తిందో ఏమిటో?" అంది నానమ్మ.

నేను మౌనంగా వడ్డిస్తుండగా, నాన్న సెల్ మోగింది. నాన్న లో గొంతులో "రండి..రండి.. వెయిట్ చేస్తున్నాం" అన్నారు.

నేను టేబుల్ దగ్గర కూర్చుని వడ్డించుకుంటున్నాను. నా చేతులు వణుకుతున్నాయి.

కారు ఆగిన శబ్దం  వినిపించింది.

"హలో అంకుల్.. ఆంటీ" అంటూ ద్వారకలోపలికి వచ్చాడు.

"హాయ్ నానమ్మా" అన్నాడు.

నేను గబగబా బెండకాయ వేపుడు కలుపుకుని, ముద్ద నోట్లో పెట్టుకున్నాను. తల ఎత్తి చూడలేదు.

నా కాళ్ళు వణుకుతున్నాయి.

వీళ్ళంతా మాయం అయిపోతే, అతనిమీదకి ఉరికి చెంపలు వాయించి, కసితీరా ఏడవాలని వుంది.

ఒక్క ఫోన్ కాల్.. నా ఈగో చల్లార్చడానికి చెయ్యలేకపోయావా? ఇక్కడ తీరుబడిగా ఇన్ని చక్కపెడ్తున్నవాడివి.ఏవిటీ వ్యూహం అని అడగాలనిపించింది.

నానమ్మ ఏదో చెప్తోంది "పొద్దుట చెప్పా చెయ్యకుండా వచ్చేసింది. కాలింగ్ బెల్ మోగితే ఎవరా అనుకుని మావాడూ తలుపు తెరిచాడట...."

"సర్"ప్రైజ్‌లు మీ మనవరాలికి అలవాటేకదా నానమ్మా" ద్వారక నవ్వుతున్నాడు.

కళ్ళనీళ్ళు బయటకి రానీకుండా ముద్దమీద ముద్ద మింగుతున్నాను.

అతని అడుగుల సడి నా కెరుకే.. అని హృదయం ఎగిసి పడాల్సిన తరుణంలో కోపం ఉవ్వెత్తున రగులుతోంది.

"రిషీ.." అతని గొంతు విన్నాను.

"వాట్ నెక్స్ట్?" అడిగాను అతని వైపు తల తిప్పకుండానే.

"నీ చేతి భోజనం తినడం" అన్నాడు.

అందరూ మౌనంగా భోంచేస్తున్నారు. నేను లేచి చెయ్యి కడుక్కుని నా గదిలోకి వెళ్ళాను.

"రిషీ ..రిషీ.." అమ్మ పిలుస్తున్నా నేను వినలేదు.

కాసేపటికి అతను నేను ఊహించినట్లే నా గదిలోకి వచ్చాడు.

"నామీద ఎందుకు ఇంతకోపం?" అడిగాడు.

"ఇంట్లో అంతా పేషెంట్స్, బయటకి వెళ్ళి మాట్లాడుకుందాం అన్నాను.

"సరే.. నా గెస్ట్ హౌస్‌కి వెళ్దాం" అన్నాడు.

"ద్వారకా.. ఇదివరకు నువ్వూ నేనూ పెళ్ళికాకుండా కలిసి వుందాం ఇది మనిద్దరి సమస్య. మీ కుటుంబం, సమాజం నాకు అక్కర్లేదన్నావ్ గుర్తుందా?" అన్నాను.

అతను తల ఊపాడు.

"ఇప్పుడు నా తల్లితండ్రుల్ని నీవైపు తిప్పుకున్నావ్. నీకున్న తెలివి తేటలకి సమాజాన్ని టాకిల్ చేస్తావ్. నాకు తెలుసు కానీ మన మధ్య సమస్య అలాగే వుంది కదా" అన్నాను.

"ఏమిటది?" అన్నాడు.

"నా ఈగో" అన్నాను.

పెద్దగా నవ్వాడు.

"అది నవ్వులాట విషయంకాదు ద్వారకానందన్.. నా జీవితం" అన్నాను.

"లివిన్‌కి ఇప్పుడు నువ్వు ఒప్పుకోనంటావంతేకదా!" అన్నాడు.

"పెళ్ళికి కూడా నీతో ఒప్పుకోను" అన్నాను.

"నీకు కొంచెం పెంకితనం అనుకున్నాను. కానీ పిచ్చి అని ఇప్పుడే తెలిసింది" అన్నాడు.

"ఔను. పిచ్చే. ఏడాదిగా నిన్ను తలుచుకోని రోజు లేదు. నువ్వు అనుక్షణం గుర్తొస్తూవుంటే మనసు తిప్పుకోడానికి శతవిధాల ప్రయత్నించాను. నువ్వేం చేసావ్? ఒక్క ఫోన్ కాల్ కూడా చేసి నా బాధని పోగొట్టలేదు. ఎక్కడున్నావో నాకు తెలీదు. అమ్మా నాన్నలని కలిసి, నీ మాటల చాతుర్యంతో నీవైపు తిప్పుకున్నావ్. ఇంత టైం ఈ పనులకీ నీ డబ్బూ హోదా వాళ్ళకి తెలియజెయ్యడానికీ వాడావు. ఒక నెంబర్ దయల్ చెయ్యలేకపోయావ్"

"ఏ...య్ హోల్డాన్.. మీ అమ్మా నాన్నని కలిసినప్పుడు వారి ఆరోగ్యం ఇలా పాడవుతుందనీ, నేను హెల్ప్ చేస్తాననీ నేనేం కల కనలేదు. నేను చేసినదల్లా.."

"మధ్య తరగతి వాళ్ళు నీ పరపతి చూసి నీ తప్పులని కూడా ఒప్పుకుంటారని ఊహించావు" అన్నాను.

"ఏం మాట్లాడ్తున్నావో నీకు తెలుస్తోందా?" అతని మొహం సీరియస్‌గా అయింది.

"మొదటినుండీ నువ్వు ప్లాన్ ప్రకారమే నన్నూ నా వాళ్ళనీ వలలో వేసావ్.."

"వాట్?" ఆశ్చర్యంగా చూసాడు.

"నాతో ఫ్రెండ్‌షిప్.. ఆ తర్వాత ప్రేమ... మనం ఇద్దరం రిలేషన్ పెట్టుకోడం.. నీ లివింగ్ టుగెదర్ ప్రతిపాదన. నేను కాదని ఏ కారణాలు చెప్పానో ఆ కారణాలని ఇరేజ్ చేసి, నీమాట నెగ్గించుకోడానికి చేసిన ప్రయత్నం. నాతో మాట్లాడీ, లేదా నన్ను కలిసి ప్రేమతో దగ్గరవడానికి చేసుంటే బావుండేది. ఎంత నరకం పడ్డానో నా మనసుకి తెలుసు" కళ్ళనుండి నీళ్ళు నాకు ధారాపాతంగా కారిపోతున్నాయి.

అతను లేచి వచ్చి నా భుజం మీద చెయ్యి వేసాడు. తీసి విసిరి కొట్టాను.

"నన్ను ప్రేమిస్తున్నాం అని ఇద్దరు ముగ్గురు అన్నారు. అందులో ఒకరిద్దరు కాలక్షేపం చేసి తర్వాత తమ అంతస్తుకి తగ్గ అమ్మాయిలని పెద్దవాళ్ళు కుదిరిస్తే పెళ్ళాడుదాం అనుకున్న వాళ్ళు, ఇంకా ఒకడు భార్యకి తెలీకుండా నా భావుకత్వాన్నీ, అమాయకత్వాన్నీ ఎంజాయ్ చేస్తూ ఉంచుకుందాం అనుకున్నవాడు" అన్నాను.

"రిషీ! అన్యాయంగా నన్నూ వారితో జమకట్టకు" ఈసారి అనునయంగా అన్నాడు.

అతని కళ్ళవైపు చూస్తే నేను కరిగిపోతానని, నేను బింకంగా తల తిప్పకుండా నిలబడ్డాను.

"నీ ఇష్టం రిషీ! పెళ్ళి చేసుకుందాం.. నిన్ను వదిలి దూరంగా వుండడం నిన్ను వదులుకోవడం నాకు కష్టం" అన్నాడు.

"ఒక ఏడాది కాలం నాకు తెచ్చియ్యి.. నేను చాలా ఏడ్చాను. పోనీ ఒక్కరోజు..గడిచిన ఒక్కరోజు నాకు తెచ్చివ్వు. నా మనసుతో నీ ఇష్టం వచ్చినట్లు ఆడుకునే హక్కు నీకు ఎవరిచ్చారు?" అరిచినట్లు అడిగాను.

"ప్లీజ్ నా మాట కూడా అర్ధం చేసుకో" అన్నాడు.

"ఏవిటి నీ మాట? నేను పోతే ఇంకోత్తి వస్తుంది అనుకుంటే దొరకలేదా?" అన్నాను.

అతను తల రెండు చేతులతో పట్టుకుని ఆకాశం కేసి చూసాడు.

నేను నా లోలోపల చాలా ఏడుస్తున్నాను పైకి రాకుండా విశ్వ ప్రయత్నం చేస్తున్నాను.

"కూర్చో.. మాట్లాడదాం" నన్ను తనవైపు తిప్పుకుంటూ అన్నాడు.

అది అతని టెర్రెస్ గార్డెన్. మధ్యలో ఒక చంద్రవంక శిల వుంది. దానిమీద నన్ను కూర్చో పెట్టాడు.

నా పక్కన అతను కూర్చున్నాడు.

నా చెయ్యి పట్టుకోగానే విదిలించుకుంటూ  చెప్పాను "నన్ను ముట్టుకోకు"

"నేనంటే అసహ్యమా?"

"చెప్పలేను.. చాలా హర్ట్ అయ్యాను" అన్నాను.

"రిషీ! నువ్వు ఒక మామూలు ఆడపిల్లవనీ ఇలా రియాక్ట్ అవుతావనీ అనుకోలేదు. నా పరిస్థితి అర్ధం చేసుకో. రెండు నిమిషాలు మాట్లాడకుండా నేను చెప్పేది విను" అన్నాడు.

'పసితనంలో, ఏవీ తెలీని వయసులో.. నాతో రోజూ ఫైటింగ్ ఆటలు ఆడే సూపర్‌మాన్‌లాంటి నాన్న గుండెల మీద ఆడి ఆడి అలసిపోయి పడుకునేవాడిని. అమ్మ ఎందుకు గొడవ పడేదో ఇద్దరూ విడివిడిగా నన్ను దగ్గరకి తీసుకుని ముద్దులు పెట్టుకుని కన్నీళ్ళు ఎందుకు కార్చేవారో అర్ధం అయ్యేదికాదు. కొన్నాళ్ళకి నాన్న ఇంట్లో కనిపించలేదు.

"అమ్మా.. నాన్నా.. నాన్న కావాలి" అని మారాం చేస్తుంటే, అమ్మ బోలెడు బొమ్మలు కొనిపెట్టేది. నాకు ఆ వయసులో కావలసింది నిశ్చింత. ఒక సూపర్‌మేన్‌లాంటి నాన్న "నేనున్నాను" అంటూ నా తల నిమిరి, నన్ను తన గుండెలమీద పడుకోపెట్టుకునేవాడు. అమ్మకూడా ఒక్కత్తే ఏడుస్తూ వుండేది. నేను మరీ విసిగిస్తే పోరా.. నువ్వా నన్ను వదిలేసి పో. నేను చస్తాను. నాకెవరూ అక్కర్లేదు" అనేది.

అమ్మ నా ప్రాణం. అమ్మ ఏడిస్తే చూడలేకపోయేవాడిని. నాన్న ఫోన్ చేస్తే నేను మాట్లాడినా అమ్మ సహించేదికాదు. నాన్న వచ్చి నన్ను తనతో పంపమంటే చాలా తిట్టి గొడవ చేసి తలుపు వేసేసేది.

నేను "నాన్న నాన్న" అని ఏడిస్తే "ఇంత ప్రేమగా చూస్తున్నా నేను నీకు అక్కర్లేదు కదూ! వెళ్ళరా ఆయనతోనే వెళ్ళు" అనేది. అమ్మ ఏడిస్తే నేను చూడలేను. వాళ్ళిద్దరి మధ్యనా ఏం జరుగుతుందో నాకు తెలిసేది కాదు. నా కథల పుస్తకాలలో 'నాన్న' బొమ్మలనీ, అమ్మా నాన్నలతో వున్న కార్టూన్ ఫిల్మ్ లనీ చూస్తూ ఏడుస్తూ పడుకునేవాడిని. స్విమ్మింగ్‌కీ, కరాటే క్లాస్‌లకీ, బేస్‌బాల్ గేమ్స్ కీ నాతోటి ఫ్రెండ్స్ వాళ్ళ డాడీలతో వస్తుంటే నాన్న మరీ మరీ గుర్తొచ్చేవారు.

అమ్మ నేను అడిగినదల్లా చేసేది. చూసినదల్లా కొనిపెట్టేది. కానీ నాకు కావలసిన నాన్నని మాత్రం తెచ్చి పెట్టేది కాదు. చీకటిలో ఏవో ఆకారాలు భయపెట్టినప్పుడు నాన్నా... అని అరుస్తూ లేచి కూర్చునేవాడిని. నెమ్మదిగా ఒక్కొక్క క్లాసూ పెరుగుతున్న కొద్దీ, నాన్న ఆకారం మరుగున పడసాగింది. అమ్మే నా సర్వస్వం అయింది. కానీ నా దుర్భరమైన బాల్యం నన్ను మానసికంగా అభద్రతాభావానికి గురి చేసింది. పెళ్ళి అనే ఈ వ్యవస్థ ఇద్దరు మంచి మనుషులని బద్ధ శత్రువులుగా మారుస్తుందని అనిపించేది.

నేను మేజర్ని అయ్యాక ఒకరోజు నాన్న దగ్గరనుండి నాకు లెటర్ వచ్చింది.

"బాబూ.. నీకు నేను ఏమీ చెయ్యలేకపోయాను. కానీ ఇప్పుడు నువ్వు మేజర్‌వి. నీ నిర్ణయాలు నువ్వు తీసుకోగలవు. ఒక్కసారి వస్తావా?" అని అడిగారు.

అమ్మతో మొదటిసారి "నాన్నని చూస్తాను" అని ధైర్యంగా చెప్పాను. ఆమె మొహంలో భయం.. మళ్ళీ అదే అభద్రతా భావం. ఏవిటీ మానవసంబంధాలు. ఎవరో ఒకరిని పోగొట్టుకోవలసిందేనా? ప్రేమనీ మనుషుల్నీ హాయిగా స్వేచ్ఛగా పంచుకోలేరా? ఒకరికి దగ్గరయితే ఒకరికి దూరం కావడమేనా?

అసలు నేనేం తప్పు చేసానని వీళ్ళిద్దరూ నాకు పసి వయసులో ఇంత దారుణమైన శిక్ష వేసారు? నీకు చెప్పినంత ఈజీకాదు నేను మేజర్ అయ్యేదాకా పడ్డ నరకం...

నాన్నని చూడగానే, నా చిన్నప్పటి తియ్యని జ్ఞాపకాలు ఒక్కసారిగా నన్ను చుట్టి ముట్టి ఉక్కిరి బిక్కిరి చేసాయి.

"బాబూ" అని ఆయన నన్ను కౌగిలించుకుంటే, ఆ ఆత్మీయ స్పర్శని ఏ డబ్బు? ఏ స్టేటస్ తెచ్చివ్వగలదు ఆ ఆనందాన్ని నేను ఆయనతో వున్న ప్రతి నిమిషం అనుభవించాను. నేను నవ్వినా, నడిచినా, తింటున్నా, ఆయన మనసూ కళ్ళూ ఆనందంతో తడి అయ్యేవి. నేను వెళ్ళే రోజున మళ్ళీ ఆయన ఈ నిమిషం రాదేమో అన్నట్లు గట్టిగా కౌగలించుకుని ఏడ్చారు.

"నేను ఉండిపోనా నాన్నా?" అంటే "దేవకి పిచ్చిదైపోతుంది ఒద్దు" అన్నారు.

ఆ స్థితి ఏ కొడుక్కి రాకూడదు. అనుకున్నాను. అనుకోకుండా నా కళ్ళల్లో కూడా నీళ్ళు వచ్చి ద్వారక చేతి మీద నా చేతిని వేసి  పట్టుకున్నాను.

"ఆ తర్వాత నుండీ నేను అక్కడ వుంటే ఇక్కడ నాన్నా, ఇక్కడ వుంటే అక్కడ అమ్మా పడే బాధ చూస్తూ పెరిగాను. ఈ వివాహం మనుషుల ప్రేమలకన్నా ముఖ్యం అయిన ఈగోలూ ఆ తర్వాత ఒక పొరపాటుకి జీవితాంతం కుమలడం..

బ్రతికినన్నాళ్ళూ నరకం అనుభవించడం.. ఇవన్నీ ఇంటర్ డిపెండెన్సీ వల్లనే. ఈ డిపెండెన్సీ పెళ్ళి వల్లే వస్తోంది. అది నాకొద్దు అనుకుని నేనెవరితో సీరియస్‌గా ప్రేమలో పడలేదు. ప్లేబోయ్‌లా జీవితాన్ని ఆషామాషీగా, ఒక ఆటలా తీసుకునే గాలికి తిరిగే  కుర్రాడిలా మాత్రమే మిగలాలనుకున్నాను. సీరియస్ బాండ్స్ రిలేషన్స్ వద్దు అనుకున్నాను. కానీ నువ్వు నా దృష్టిలో ఎప్పుడు పెరిగిపోయావ్ అంటే తల్లి తండ్రులే ముఖ్యం అని, నా ప్రపోజల్ తోసిపారేసి వెళ్ళిపోయిననాడు. నీ ఏడాది బాధకి నా దగ్గరున్న బాల్యపు గాయాలే కారణం" అని ఆగాడు.

*(ముగింపు వచ్చే నెలలో)*

COMMENTS